క్లుప్తంగా

విజేతలకు బహుమతుల ప్రదానం

మానవపాడు: మండలంలోని జల్లాపురం గ్రామంలో బుధవారం బండలాగుడు పోటీలు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి బహుమతి కిశోర్‌కుమార్ రూ. 50వేలు, రెండో బహుమతి సురేష్ రూ.40వేలు దాతలు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

అయిజ: మండలంలోని ఉత్తనూరులో బుధవారం ఎస్‌బీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, హైదరాబాద్ శంకర కంటి ఆస్పత్రి సంయుక్తంగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 78 మందికి కంటి పరీక్షలు చేశారు. 13 మందికి కంటి శుక్లాలు తొలగించే శస్త్ర చికిత్సకు రెఫర్ చేశారు. ఉచితంగా శస్త్ర చికిత్స అందించేందుకు శంకర కంటి ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



అయిజ: మండలంలోని ఉప్పల, పులికల్ గ్రామాల్లో బుధవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ ప్రశాంత్‌గౌడ్ పరిశీలించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్రాన్స్‌పోర్ట్ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఐకేపీ సిబ్బందికి సూచించారు. సంచుల కొరత లేకుండా చూడాలన్నారు. సన్నవడ్లను బియ్యం ఆడించి గోదాంలకు తరలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది, రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో చోరీకి విఫలయత్నం




ధరూరు: మండల పరిధిలోని రేవులపల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు కంప్యూటర్ గది తాళాలు పగులగొట్టి చోరీకి విఫలయత్నం చేశారు. బుధవారం ఉదయం పాఠశాల సమీపంలోని స్థానికులు గుర్తించి ఉపాధ్యాయులకు తెలియజేశారు. పాఠశాలలో ఎలాంటి సామగ్రిని అపహరించనట్లు ఉపాధ్యాయులు గుర్తించారు. ఈ క్రమంలో గ్రామాల్లో పోలీసులు గస్తీ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

లీకేజీలపై దృష్టి సారించాలి



గట్టు: ముడుగు కాల్వల్లో తాగునీటి పైపులైన్ లీకేజీ అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని బండమీదిగేరితో పాటుగా ఆయా కాలనీల్లో మిషన్ భగీరథ నీరు అందక తాగునీటికి ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు. తాగునీటి సమస్య, లీకేజీలపై అధికారులు దృష్టిని సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



మల్దకల్: బాలకార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలను నిర్మూలించడమే మనందరి బాధ్యతని బాలల సంరక్షణ కౌన్సిలర్ సురేష్, చైల్డ్‌లైన్ సభ్యుడు ప్రకాష్ అన్నారు. బుధవారం మద్దెలబండ గ్రామంలో శిశు సంక్షేమ శాఖ, చైల్డ్‌లైన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థపై ప్రజలకు అవగాహన కల్పించారు. బడిఈడు పిల్లలతో పనులు చేయించడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, చైల్డ్‌లైన్ సభ్యులు పాల్గొన్నారు.

కలగానే వంతెనల నిర్మాణం

- ఏళ్లు గడుస్తున్నా తప్పని తిప్పలు
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు



మానవపాడు- అమరవాయి మధ్య పారుతున్న వాగు(ఫైల్)

మానవపాడు: వర్షం పడితే చాలు మండల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికే గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లోని వాగులపై వంతెనలు (బ్రిడ్జి) లేక అవస్థలు పడుతున్నట్లు వాపోతున్నారు. వర్షాకాలం ప్రారంభమయ్యే లోపు ఏళ్ల తరబడి పడుతున్న అవస్థలు తొలగించాలని కోరుతున్నారు.

నియోజకవర్గ వ్యాప్తంగా

అలంపూర్ నియోజకవర్గంలోని 7 మండలాల్లో మొత్తం 124 గ్రామాలు ఉన్నాయి. వర్షం పడితే వంతెనలపై వెళ్లేందుకు ప్రజలు, వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. మానవపాడు మండలంలోని మానవపాడు- అమరవాయి, చెన్నిపాడు- మానవపాడు, అమరవాయి- కలుకుంట్ల, ఇటిక్యాల మండలంలోని ఆర్. గార్లపాడు- కరుపాకుల, ఇటిక్యాల- ఉదండాపురం గ్రామాల్లో వంతెనలు, ఉండవెల్లి మండలంలోని ఉండవెల్లి- చిన్న అముదాలపాడు, కంచుపాడు- చిన్నఆముదాలపాడు, వడ్డేపల్లి మండలంలో జులకల్లు- జులకల్లు స్టేజి, రామాపురం- వల్లూరు, కోంకల- వడ్డేపల్లి, రాజోళిలో తుమ్మిల- మాన్‌దొడ్డి, అయిజ మండలంలో అయిజ- పరదాపురం, అలంపూర్ మండలంలో అలంపూర్- గొందిమల్ల గ్రామాల్లో వాగులపై వంతెనల నిర్మాణాలు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయని, అదే విధంగా ఆయా గ్రామాల్లో కల్వర్టులు ఏర్పాటు చేయాలని మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాకపోకలకు అవస్థలు

చిన్నపాటి వర్షానికే గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. మానవపాడు మండలంలోని ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్‌కు చెందిన బీటీ రోడ్ల మధ్య ఉన్న వాగులపై వంతెనలు లేక అవస్థలు పడుతున్నట్లు వాపోతున్నారు. రైతులు తమ పొలాలకు వెళ్లేటప్పుడు వాగుల వద్ద ఎద్దుల బండ్లు ప్రమాదాలు గురౌతున్నాయని పేర్కొంటున్నారు. కల్వర్టులు లేని వాగుల వద్ద వరద ఉధృతంగా ప్రవహిస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాహనదారులు, ప్రజలు వాపోతున్నారు. ప్రమాదకర కల్వర్టులపై వంతెనలు నిర్మించాలని ఏళ్ల తరబడి అధికారులు, ప్రజా ప్రతినిధులు చుట్టు తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మానవపాడు- చెన్నిపాడు మధ్య వాగు దాటుతున్న ప్రజలు(ఫైల్)

వంతెన నిర్మించాలి



అమరవాయి- మానవపాడు మధ్య ఉన్న వాగుపై వంతెన నిర్మించాలి. వర్షం కురిసిందంటే రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కలుకుంట్ల, మద్దూరు, శాంతినగర్, చంద్రశేఖర్‌నగర్ గ్రామాలకు వర్షాకాలంలో వెళ్లేందుకు అంతరాయం ఏర్పడుతుంది.

– బజారన్న, మానవపాడు

నత్తనడకన పనులు



ఆర్. గార్లపాడు వద్ద వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. నిధులు మంజూరైన పిల్లర్లకు గుంతలు మాత్రమే తవ్వి వదిలేశారు. ఇప్పటికైనా బ్రిడ్జి నిర్మాణాలు పూర్తి చేయాలి. వర్షాకాలంలో ఇబ్బందులు పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– దండు బీసన్న కారుపాకుల, ఇటిక్యాల

ప్రతిపాదనలు పంపించాం

అలంపూర్ నియోజకవర్గంలోని మండలాల్లో ఉన్న వాగులపై వంతెన నిర్మాణాలు చేపట్టడానికి ప్రతిపాదనలు పంపాం. ఉన్నతాధికారులకు నివేదికలు సైతం అందజేశాం. వంతెనల నిర్మాణాలకు నిధులు మంజూరైన వెంటనే నిర్మాణాలు చేపడతాం.

– రాజేశ్వరి, ఇన్‌చార్జ్ ఏఈ, ఆర్‌అండ్‌బీ అలంపూర్

గర్భిణులకు పౌష్టికాహారం అందించాలి

మల్దకల్: గర్భిణులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలని సీడీపీఓ హేమలత అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. బుధవారం మల్దకల్ ప్రాజెక్టు కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులు నెలనెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేయించుకునేలా వారిని ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వాసంతి, టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి



ధరూరు: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ శ్రీహరి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో వాహన తనిఖీలతో పాటు డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తికర బోధన అందించాలి



మాట్లాడుతున్న కోర్సు డైరెక్టర్ శివప్రసాద్



శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

- రెండో రోజు ఉపాధ్యాయుల శిక్షణ

అలంపూర్: విద్యార్థులకు ఆసక్తికర బోధన అందించాలని కోర్సు డైరెక్టర్ శివప్రసాద్ అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని విశ్వశాంతి పాఠశాలలో ఉపాధ్యాయులకు రెండో రోజు బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. విద్యార్థులకు ఆసక్తికరంగా, అర్థవంతంగా బోధన చేయాలన్నారు. నూతన సాంకేతికతను ఉపయోగించి బోధనను మరింత సులువుగా చేసేందుకే ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు ఉపయోగపడుతాయన్నారు. తెలుగు, ఆంగ్లం, గణితం, పరిసరాల విజ్ఞానంతో పాటు ఉపాధ్యాయుల సామర్థ్యాలపై శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సెంటర్ ఇన్‌చార్జ్‌లు హేమలత, అనితబాయి, ఆర్పీలు రాణి, శాలం, విజయభాస్కర్‌రెడ్డి, గజరాజు, సత్యనారాయణమూర్తి, మక్బుల్, కుమార్‌నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలంపూర్‌లో..

అలంపూర్ పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు రెండో రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కోర్సు డైరెక్టర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల స్థాయికి తగిన బోధన అందించాలన్నారు. నూతన బోధన పద్ధతులు, పాఠ్యాంశ నిర్మాణాల గురించి ఆర్పీలు ఉపాధ్యాయులకు వివరించారు. కార్యక్రమంలో ఆర్పీలు వీరేషప్ప, నాగరాజు, పద్మనాభశాస్త్రి, శ్రీనివాసులు, రాజ్‌కుమార్, శ్యాంసన్, పెద్దయ్య నాయుడు, ఎల్లకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకునే విధంగా బోధించాలి

గట్టు: విద్యార్థులను ఆకట్టుకునే విధంగా ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను బోధించాలని జిల్లా రిసోర్స్ పర్సన్ జయమ్మ అన్నారు. గట్టు మండల ఉపాధ్యాయులకు గద్వాలలోని సరస్వతి విద్యామందిర్‌లో నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో ఎంఈఓ నల్లారెడ్డితో కలిసి పాల్గొన్నారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా ఎలా బోధించాలన్నా అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు కుల్దీప్‌నయ్యర్, రంగన్న, విక్రమసింహాచారి, సద్దాం హుస్సేన్, మహేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుతో ప్రజల అవస్థలు



మాట్లాడుతున్న నాయకులు

రాజోళి: గుంతలమయమైన పెద్దధన్వాడ రోడ్డు తో ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ అన్నారు. బుధవారం పెద్దధన్వాడ రోడ్డు పరిస్థితిని చూపుతూ అధికారులు, నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడిగా గుంతలమయమైన రోడ్డుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా రహదారిని బాగుచేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం జిల్లా అధ్యక్షుడు దుల నాగరాజు, బళ్లేర ప్రతాప్, పుట్ట ప్రసాద్, భీమేష్, గబ్రేల్ చంద్ర తదిదరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



యోగా నేర్చుకుంటున్న విద్యార్థులు

ధరూరు: మండల పరిధిలోని ఉప్పేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉప్పేరు ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు గౌరీశంకర్ అన్నారు. బుధవారం పాఠశాలలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, గణితం, డ్రాయింగ్, యోగా తదితర సబ్జెక్ట్‌లపై అవగాహన కల్పించారు. ప్రతి సబ్జెక్ట్‌లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వలంటీర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో భారీ వర్షం

ధరూరు: మండల పరిధిలో బుధవారం సాయంత్రం ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంతో పాటు మండలంలోని జాంపల్లి, బూరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో భారీ వర్షం పడింది. మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు పూర్తిగా తడిసిపోయాయి. దీంతో రైతులు నానా అవస్థలు పడ్డారు.



ధరూరులో దంచి కొడుతున్న వర్షం



ధరూరులో ధాన్యం కొనుగోలు కేంద్రంలో పూర్తిగా తడిసిన ధాన్యపు రాశులు

వసూళ్లకు పాల్పడితే చర్యలు

మానవపాడు: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో డబ్బుల వసూళ్లకు పాల్పడితే క్రమశిక్షణ చర్యలు తప్పవని రాష్ట్ర రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ మెంబర్ పల్లి సతీష్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఏ ఒక్కరూ వసూళ్లకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక పూజలు

రాజోళి: మండల కేంద్రంలోని వైకుంఠ నారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో వెలసిన కోట ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆలయంలో బిందె సేవ, పంచామృతాభిషేకం, ఆకు పూజ, మంగళ హారతి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

అహల్యాబాయి నేటి తరానికి ఆదర్శనీయం



వనపర్తిటౌన్: పదేళ్లకే పెళ్లి, పెళ్లయినా కొన్నేళ్లకే భర్త యుద్ధంలో మరణిస్తే రాజ్యం బాధ్యతలు తీసుకొని పాలన చేసిన అహల్యాబాయి హోల్కర్ సేవలు మరువలేనివని బీజేపీ రాష్ట్ర సమన్వయకర్త నాగపరిమళ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మీ గార్డెన్స్‌లో అహల్యాబాయి 300వ జయంతిని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. ఆలయాలను మసీదులుగా మారుస్తున్న కాలంలో రాణి అహిల్యాబాయి తన సంస్థానం నుంచి వచ్చిన ఆదాయంతో దేశంలో అనేక సంస్థానాల్లో హిందూ ఆలయాలను నిర్మించారని కొనియాడారు. ఆమె చేసిన సేవలకు గుర్తుగా భారత ప్రభుత్వం రాణి అహల్యా హోల్కర్ పేరిట స్త్రీ శక్తి పురస్కారాన్ని, ఇండోర్ విమానాశ్రయానికి రాణి అహిల్యాబాయి హోల్కర్ అంతర్జాతీయ విమానాశ్రయంగా నామకరణం చేశారన్నారు. కార్యక్రమంలో లోకనాథ్‌రెడ్డి, సబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి, అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి, విజయలక్ష్మి, శ్రీశైలం, అక్కల రామన్‌గౌడ్, జ్యోతి రమణ, సుమిత్రమ్మ, బండారు కుమారస్వామి, ఎ.సీతారాములు, విష్ణువర్ధన్‌రెడ్డి, వారణాసి కల్పన తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

పాన్‌గల్: గ్రామ పంచాయతీ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ సీఐటీయూ, జీపీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీఓ గోవింద్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశం రాము మాట్లాడుతూ.. జీపీల్లో పనిచేస్తున్న కార్మికులకు మూడు, నాలుగు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో నాగన్న, బాలస్వామి, తిరుపతయ్య, సుగ్రీవుడు, లాల్య, చందు, శివ, చంద్రశేఖర్, వెంకటయ్య, హర్షనయ్య, కుర్మయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ ఏఈ సస్పెన్షన్

సాక్షి ఎఫెక్ట్..



సాక్షి పత్రికలో ప్రచురించిన కథనం



సస్పెన్షన్ ఆర్డర్ పత్రం

స్థానిక మున్సిపల్ ఏఈ ఆర్ రాజశేఖర్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 6వ తేదీన 'సాక్షి' పత్రికలో వచ్చిన 'అయిజలో తాగునీరు కలుషితం' కథనానికి స్పందించి న కలెక్టర్ విచారణ చేయించారు. సంబంధిత అధికారులు విచారణ చేసి సాక్షి పత్రికలో వచ్చిన కథనం నిజమని రిపోర్ట్ ఇవ్వడంతో మున్సిపల్ ఏఈని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

-అయిజ

నీటి సమస్యకు పరిష్కారం చూపాలి



అండర్ రైల్వే బ్రిడ్జి కింద నీటిని తొలగిస్తున్న సిబ్బంది

మానవపాడు: అండర్ రైల్వే బ్రిడ్జి కింద నీటి సమస్యతో నారాయణపురం ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు రాష్ట్ర రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ మెంబర్ పల్లి సతీష్‌రెడ్డి అన్నారు. అండర్ రైల్వే బ్రిడ్జి కింద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రైల్వే అధికారులను, జిల్లా యంత్రాంగాన్ని కోరారు. వర్షాకాలం వచ్చిందంటే నారాయణపురం, అమరవాయి, పెద్దఆముదాలపాడు రోడ్డు గుండా వెళ్లే ప్రయాణికులు, వాహనాదారులు నీటి సమస్యతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. నారాయణపురం గ్రామంలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి అండర్ రైల్వే బ్రిడ్జి కింద నీరు చేరి నానా అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మోటార్లతో నీటిని తొలగించినట్లు పేర్కొన్నారు.

పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలి



టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

గట్టు: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పశువులకు టీకాలు వేయించాలని నీతి అయోగ్ కోఆర్డినేటర్ అఫ్జల్, పశు వైద్యాధికారి నవీన్‌చంద్ర అన్నారు. మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో బుధవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఉచిత టీకాలను పశు యజమానులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశుసంతతి పెంపొందించుకోవడంతో ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చన్నారు. మొత్తం 144 పశువులకు టీకాలను వేసినట్లు తెలిపారు. గడ్డి విత్తనాలను 50 శాతం రాయితీపై అందజేస్తున్నట్లు తెలిపారు. పశు వైద్య కేంద్రంలో 500 కేజీలు గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలూరు పశువైద్యాధికారి ప్రియాంక, పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి



శాంతినగర్‌లో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



గద్వాలలో రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు

గద్వాలటౌన్: దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ నేతలు ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక రాజీవ్ సర్కిల్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ ఇన్‌చార్జ్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత పూలమాల వేసి నివాళులర్పించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశం అభివృద్ధి చెందడానికి మూల పురుషుడు రాజీవ్‌గాంధీ అని కొనియాడారు. రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు మరవలేనివన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బీఎస్ కేశవ్, నాయకులు ఇసాక్, మధుసూధన్‌బాబు, కబీర్‌దాసు నర్సింహులు పాల్గొన్నారు.

శాంతిగనర్: దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివని కాంగ్రెస్ నాయకులు అన్నారు. శాంతిగనర్‌లోని క్యాంప్ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి చేసిన సేవలతో ఆయన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో నాగశిరోమణి, దేవేంద్ర, అశోక్ రెడ్డి, దేవమ్మ తదిదరులు పాల్గొన్నారు.

అయిజ: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యర్తలు పాల్గొన్నారు.